క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన భద్రాచలం టౌన్ సీఐ


ఏఎస్పీని కలిసిన సీఐ నాగరాజు

భద్రాచలం అర్బన్: భద్రాచలం టౌన్ సీఐగా నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సీఐ నాగరాజు మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కరిస్తానని, అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్‌ను ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అశ్వారావుపేట సీఐగా నాగరాజు



అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నూతన సీఐగా పింగలి నాగరాజు స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కరుణాకర్‌ను హైదారాబాద్‌లోని ఐజీ కార్యాలయానికి అటాచ్ కాగా, ఆయన స్థానంలో జిల్లా కేంద్రంలోని ఐటీకోర్ విభాగంలో పని చేస్తున్న నాగరాజు బదిలీపై వచ్చారు. ఈ మేరకు సీఐను ఎస్సై యయాతి రాజు, ఏఎస్సైలు, పోలీస్ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మసీదు కమిటీ ఎన్నిక

అశ్వాపురం: మండల కేంద్రంలోని జామా మసీదు కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు 30 ఏళ్లుగా కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషం. నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా షేక్ అబ్దుల్ శబ్బీర్, బాజిబాబా, గౌరవ అధ్యక్షుడిగా ఆలీ ఖురేషి, ఉపాధ్యక్షుడిగా సాదిక్‌పాషా, సంయుక్త కార్యదర్శిగా అబ్దుల్ మజీద్, వెల్ఫేర్ సెక్రటరీగా అబ్దుల్ వహీద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అన్వర్‌జానీ, కోశాధికారిగా హుస్సేన్ ఆలీని ఎన్నుకున్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం

దుమ్ముగూడెం : మండలంలోని తూరుబాక పంచాయతీలోని రామకృష్ణాపురం గ్రామంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని భద్రాచలం వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు పశువులకు పరీక్షలు నిర్వహించి, యజమానులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ లిఖిత, రైతులు బొల్లి శేఖర్ యాదవ్,భవనం. కరుణాకర్ రెడ్డి, రైతులు,పశు వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రాజుపేటలో వైద్యశిబిరం

మణుగూరు టౌన్: సింగరేణి వైద్య విభాగం, సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో సింగరేణి వైద్యశిబిరం రాజుపేట వద్ద శనివారం నిర్వహిస్తున్నట్లు డీజీఎం పర్సనల్ రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజుపేట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే శిబిరాన్ని, స్థానికులు పీకే-1 ఇంక్‌లైన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సభను జయప్రదం చేయాలి

దుమ్ముగూడెం: వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలని బీఆర్‌యస్ యూత్ మండల అధ్యక్షుడు లంక శివ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మండలం నుండి భారీఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పేర్కొన్నారు.

ఇళ్లు మంజూరు చేయాలి

దుమ్ముగూడెం: మండలంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొర్స చిలకమ్మ, మర్మం చంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మంగువాయిబాడవ, బట్టిగూడెం గ్రామాలలో సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై సర్వే చేశారు. శాఖ కార్యదర్శి పిసోడి ప్రభాకర్, మడకం లక్ష్మి, సరియం నాగేశ్వరరావు, సుబ్బారావు, నారాయణ చిట్టెమ్మ,రాధ, జయమ్మ, నాగమణి పాల్గొన్నారు

చేపలవేట

అశ్వాపురం: మండల పరిధిలోని కాకతీయుల కాలం నాటి సుప్రసిద్ధ సాగునీటి వనరైన తుమ్మలచెరువులో శుక్రవారం నుంచి చేపల వేట సాగిస్తున్నారు. మత్స్య సొసైటీ ఆధ్వర్యంలో చేపల వేట చేపడుతున్నారు. స్థానికులకు చేపలు పూర్తి స్థాయిలో విక్రయించకుండా సంబంధిత కాంట్రాక్టర్ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలు పాటించి స్థానికులకు తక్కువ ధరకు చేపలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వరకట్న వేధింపు కేసు

చంద్రుగొండ: మండలంలోని తుంగారం పంచాయతీ వెంగళరావు కాలనీకి చెందిన గుగులోత్ పద్మ ఫిర్యాదు మేరకు భర్త రమేష్‌పై వరకట్నం వేధింపు కేసు నమోదు చేసినట్టు ఎస్సై శివరామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కాలనీకి చెందిన పద్మకు అదే కాలనీకి చెందిన రమేష్ 2012లో వివాహం జరిగగా వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు మద్యం, బెట్టింగులకు అలవాటు పడిన రమేష్ అదనపు కట్నం కోసం పద్మను వేధిస్తుండగా ఆమె ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

యంత్రాలు.. రైతునేస్తాలు

అందుబాటులోకి ప్యాడీ క్లీనర్, ట్రాక్టర్ పంకాలు

- తాలు, మట్టిపెళ్లల సమస్యకు చెక్
- కూలీ ఖర్చులు, సమయం ఆదా

కరకగూడెం: ఆరుగాలం శ్రమించి పంటలు పండించడం ఒక సవాలైతే.. ప్రస్తుతం వాటిని అమ్ముకోవడం మరో పెద్ద సమస్యగా మరుతోంది. ఈ మేరకు పండించిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్లే ముందు తూర్పారా పట్టి తాలు, ఇసుక, మట్టి, పెళ్లలను తొలగించడం అనేది కష్టతరమైన పని. సాంప్రదాయ పద్ధతుల్లో ఈ ప్రక్రియ చాలా సమయం, కూలీ ఖర్చులను తీసుకుంటుంది. ఈ సమస్యలను అధిగమించడానికి ఆధునిక యంత్రాలు, సాంకేతికతలు కీలక పాత్ర పోషిస్తూ రైతులకు వరంగా మారాయి. ప్రస్తుతం రైతులు అవలంభిస్తున్న ప్యాడీ క్లీనర్, ట్రాక్టర్ పంకా విధానం వంటి యంత్రాలు వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నాయి. దీంతో రైతులు ఈ యంత్రాలను ఉపయోగించి డబ్బు, సమయం ఆదా చేసుకుంటున్నారు.

ప్యాడీ క్లీనర్‌తో నాణ్యత..


ప్యాడీ క్లీనర్‌తో ధాన్యం శుద్ధి..

వరి పంట ప్రధాన ఆహార పంటల్లో ఒకటి. అయితే ధాన్యాన్ని మార్కెట్‌కు సిద్ధం చేయడానికి తూర్పారా పట్టడం అత్యంత ముఖ్యం. సాంప్రదాయ పద్ధతుల్లో, రైతులు చేతితో లేదా సాధారణ సాధనాలతో ధాన్యాన్ని తూర్పారా పడుతుంటారు. ఇది సమయం, అధిక ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ. కానీ ఈ సమస్యను పరిష్కరించడానికి 'ప్యాడీ క్లీనర్' ఒక వరంగా మారింది. ఇది ఆధునిక ఒక యంత్రం వరి ధాన్యం నుంచి తాలు, ఇసుక, మట్టి పెళ్లలు, రాళ్లు వంటి అవాంఛిత పదార్థాలను సమర్థవంతంగా వేరు చేస్తుంది. ఈ యంత్రం బ్లోవర్, వైబ్రేటింగ్ స్క్రీన్, గ్రేడింగ్ సిస్టంలతో పనిచేస్తుంది. ఇది వరిని గాలి పీడనం ద్వారా శుద్ధి చేస్తుంది వివిధ రకాల స్క్రీన్‌లతో ధాన్యాన్ని గ్రేడ్ చేస్తుంది. ఇది విద్యుత్ ద్వారా పనిచేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఉచితంగా ఈ యంత్రాన్ని అందుబాటులో నిర్వాహకులు ఉంచారు.

- ➡ ప్యాడీ క్లీనర్ ఒక గంటలో 30 నుంచి 35 క్వింటాల ధాన్యాన్ని శుభ్రం చేస్తుంది. దీనివల్ల కూలీ ఖర్చులు గణనీయంగా తగ్గి సమయం కూడా ఆదా అవుతుంది.
- ➡ శుద్ధి చేసిన ధాన్యం మార్కెట్‌లో ఎక్కువ ధర పొందుతుంది. ఎందుకంటే ఇది అధిక నాణ్యతతో ఉంటుంది.
- ➡ దీనిని ఉపయోగించడం సులభం, తక్కువ నిర్వహణ ఖర్చులతో పనిచేస్తుంది.

మా పని చాలా సులువైంది..



ప్యాడీ క్లీనర్ వచ్చాక మా పని చాలా సులువైంది. ముందు ధాన్యాన్ని చేటలతో శుభ్రం చేసేవాళ్లం. దానికి చాలా సమయం పట్టేది. ఇప్పుడు ఈ యంత్రం వల్ల గంటల్లోనే పని అయిపోతుంది. తాలు, చెత్తాచెదారం మొత్తం తొలగిపోయి ధాన్యం శుభ్రంగా వస్తుంది. దీనివల్ల సమయం, డబ్బు రెండు ఆదా అవుతున్నాయి. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరమైన యంత్రం.

– నాలి రామకృష్ణ, రైతు, కరకగూడెం

వాడేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి



ప్యాడీ క్లీనర్, ట్రాక్టర్ పంకా యంత్రాలతో రైతులకు అనేక లాభాలు ఉన్నాయి. సమయం, కూలీల ఖర్చులతో పాటు వారికి నాణ్యత పెరుగుతుంది. తద్వారా వారికీ మంచి ధర లభిస్తుంది. ఈ యంత్రాలు వాడేటప్పుడు రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ధాన్యాన్ని శుభ్రపరిచేటప్పుడు తగినంత దూరం పాటించాలి. ఏదైనా సమస్య వస్తే వెంటనే నిపుణులను సంప్రదించాలి. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలి.

– ఛటర్జీ, ఏఓ, కరకగూడెం

ట్రాక్టర్ పంకాతో తూర్పారా సులభం

ట్రాక్టర్ వ్యవసాయంలో ఒక అనివార్య సాధనం అయితే ట్రాక్టర్ పంకా విధానం దీనిని మరింత బహుముఖంగా మార్చింది. ఈ విధానంలో ట్రాక్టర్‌కు అనుసంధానించబడిన ఫ్యాన్ లేదా బ్లోవర్ ద్వారా ధాన్యాన్ని తూర్పారా పట్టడం చేస్తారు. ఈ పద్ధతి ప్రధానంగా వరి, గోధుమ, జొన్నలు వంటి పంటలను శుద్ధి చేయడానికి ఉపయోగించబడుతుంది. ఈ విధానంలో ట్రాక్టర్ యొక్క పవర్ టేక్ ఆఫ్ షాఫ్ట్ ద్వారా ఫ్యాన్‌కు శక్తి అందించబడి గాలి ప్రవాహాన్ని సృష్టిస్తుంది. ఇది ధాన్యాల నుండి తేలికైన అవాంఛిత పదార్థాలను (తాలు, పెళ్లలు) వేరు చేస్తుంది.


ట్రాక్టర్ పంకాతో తూర్పారా..

- ➡ ట్రాక్టర్ పంకా విధానం గంటకు టన్నుల కొద్దీ ధాన్యాన్ని శుద్ధి చేయగలదు. ఈ విధానం ట్రాక్టర్‌ను ఉపయోగిస్తుంది కాబట్టి, అదనపు యంత్రాల కొనుగోలు అవసరం లేదు. ఇది చిన్న రైతులకు ఆర్థికంగా సమర్థవంతమైన ఎంపిక.
- ➡ ట్రాక్టర్ ద్వారా ఈ సాధనాన్ని సులభంగా ఒక పొలం నుండి మరొక పొలానికి తీసుకెళ్లొచ్చు.
- ➡ ట్రాక్టర్ పంకా విధానం ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ఉపయోగించబడుతుంది, ఎందుకంటే ఇది సులభంగా అందుబాటులో ఉంటుంది మరియు ఖర్చు తక్కువ.

మ్యూజియానికి మరింత ప్రాచుర్యం తేవాలి


స్టికర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

భద్రాచలంటౌన్: ట్రైబల్ మ్యూజియం ప్రారంభమైన నాటి నుంచి రోజురోజుకు సందర్శకుల తాకిడి పెరుగుతుందని, మ్యూజియానికి మరింత ప్రాచుర్యంలోకి తేవడానికి రెవెన్యూ అధికారుల సహకారం తప్పనిసరిగా ఉండాలని ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. మ్యూజియానికి ప్రచార స్టిక్కర్లను సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో దామోదర్ రావుతో కలిసి ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మ్యూజియం ప్రాముఖ్యతను తెలియజేయడానికి స్థానిక రెవెన్యూ అధికారులు వారి పరిధిలోని కార్యాలయాలకు తెలియజేసి మ్యూజియం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోతహసీల్దార్ అశోక్ కుమార్, జేడీఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిపై నిరసన


భద్రాచలంటౌన్: నివాళులర్పిస్తున్న ఆలయ అధికారులు, వైదిక సిబ్బంది

మణుగూరు రూరల్: జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు శివసైదులు, మహిళా మండల అధ్యక్షురాలు సౌజన్య, యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, నాయకులు సామా శ్రీనివాస్‌రెడ్డి, జీవరత్నం, గోరంట్ల కనకయ్య, అబ్దుల్లా, సాంబశివరావు, శ్రీను, ఈశ్వర్ రెడ్డి, లక్ష్మణ్, శ్యామలదేవి, మంగ, దినేష్, నాగేశ్వరరావు, కృష్ణ ఉన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థాన పాలక, వైదిక సిబ్బంది ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆలయ అధికారులు, వేదపండితులు, సిబ్బంది ఉన్నారు.

ములకలపల్లి: ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ములకలపల్లి బీజేపీ, వీహెచ్‌పీ, జనసేన సంయుక్త ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పద్దం బుజ్జి, శంకర్, సత్యనారాయణరాజు,ప్రవీణ్ గుప్తా, రాజు, శ్రీను, మధు, అప్పన్న, సాయి పాల్గొన్నారు.

మసీదుల్లో..

కరకగూడెం: పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా మండలంలోని కరకగూడెం, పద్మాపురం, అనంతారం మసీదుల్లో ముస్లింలు నల్లరిబ్బన్లు ధరించి ప్రార్థనల్లో పాల్గొని నిరసన తెలిపారు. మసీదుల కమిటీ సభ్యులు సయ్యద్ సజ్జాద్ హుస్సేన్, షేక్ సోందుపాషా, ఎండి. రఫీ, సయ్యద్ ఫజల్ హుస్సేన్, యాకుబ్ ఖాన్, మహిమూద్, ఖయ్యుమ్, మౌలానాలు ఫిరోజ్, ఆజాం, ఫరుద్దీన్, అన్సార్, అఫ్రోజ్, అల్తాఫ్, ఉమర్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: ఉగ్రదాడికి నిరసనగా అశ్వారావుపేటలోని మసీదుల్లో సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి స్థానిక రింగ్ రోడ్ సెంటర్, మసీదుల ఎదుట ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ముస్లిం సదర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వలీపాషా, ఎస్‌డీ.నజీర్ ఉన్నారు.

ములకలపల్లి: ఉగ్రదాడిని మనవతావాదులందరూ ఖండించాలని ప్రముఖ రచయిత ఎండీ. ఉస్మాన్ ఖాన్ అన్నారు. జగన్నాథపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడగా అబ్దుల్ జబ్బార్, జబ్బీర్, వాజిద్, యాఖూబ్, సుభానీ, బాజీబాబా, సమీ, ఉబైద్, రంజాన్‌పాషా ఉన్నారు.


మణగూరురూరల్: కొవ్వొత్తుల ర్యాలీ..


అశ్వారావుపేటరూరల్: నిరసనలో ముస్లింలు

'మా ఊరికి రోడ్డెయ్యండి సారూ..'


రోడ్డు వేయాలని కోరుతున్న చిన్నారులు

బూర్గంపాడు: 'వర్షాకాలం వస్తే మా ఊరు రోడ్డంతా బురదమయమవుతుంది.. కనీసం నడిచేందుకు కూడా వీలులేకుండా ఉంది.. మాఊరుకి ఎలాగైనా రోడ్డెయ్యండి సారు..' అంటూ మండల పరిధిలోని సారపాకకు సమీపంలోని శ్రీరాంపుర ఎస్టీ కాలనీ వాసులు వేడుకున్నారు. ఈ మేరకు రోడ్డు వేయాలని కోరుతూ శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రమాదకర స్థితిలో ఎవరైనా ఉన్నప్పుడు ఊళ్లోకి 108, అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేకుండాపోవడంతో పలువురు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా రోడ్డు వేయాలని చేతులు జోడించి వేడుకున్నారు.

బీట్ ఆఫీసర్ క్వార్టర్ సందర్శన


పనులను పరిశీలిస్తున్న ఎఫ్‌డీఓ

అశ్వాపురం: మండలపరిధిలోని మొండికుంట గ్రామంలో మరమ్మతులు చేపడుతున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ క్వార్టర్ భవనాన్ని శుక్రవారం మణుగూరు ఎఫ్‌డీఓ సయ్యద్ మక్సూద్ సందర్శించారు. ఎన్నో ఏళ్లుగా నిరూపయోగంగా ఉన్న భవనాన్ని మరమ్మతులు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దడంతో ప్రత్యేక చొరవ తీసుకున్న నాగరాజును ఎఫ్‌డీఓ అభినందించారు. ఎఫ్ఆర్ఓ రమేష్, ఫారెస్ట్ అధికారుల సంఘం డివిజన్ అధ్యక్షుడు గోవిందు, సెక్షన్ ఆఫీసర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మణుగూరు టౌన్: ఏరియాలో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు అందించే వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీజీఎం పర్సనల్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి నెల రోజుల పాటు అందించే వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, కరాటే, బాస్కెట్‌బాల్‌లలో పరిమిత క్రీడాకారులకు భద్రాద్రి స్టేడియంలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మలేరియాను నిర్మూలిద్దాం..

మలేరియాను వ్యాప్తి చెందకుండా నిర్మూలించాల్సిన బాధ్యత అందరి మీద ఉందని వైద్య, ఆరోగ్య సిబ్బంది అన్నారు. మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం ర్యాలీ, మానవహారాలు నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. –సాక్షి నెట్‌వర్క్


మణుగూరు టౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది


దుమ్ముగూడెంలో..


అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..


గుండాలలో..


అశ్వారావుపేటరూరల్: వినాయకపురంలో..


ములకలపల్లిలో..

సంక్షిప్తంగా..

వేలం లేకుండా గనులు కేటాయించాలి

మణుగూరు టౌన్: టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం జీఎం కార్యాలయం ఎదుట యూనియన్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడుతూ... సంస్థకే ప్రమాదంగా మారిన బొగ్గు గనుల వేలంలో పాల్గొనవద్దన్నారు. పవన్ కుమార్, నాగేశ్వరరావు, మస్తాన్, సేవ, ముకేశ్‌కుమార్, కటారి ప్రసాద్, నరేశ్, ఇమ్రాన్, వినయ్‌కుమార్, రేవన్ ఉన్నారు.

పేద ప్రజల కోసం పోరాటం

మణుగూరు రూరల్: పేద ప్రజల కోసం పోరాటాలు చేసేది సీపీఐ అని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య అన్నారు. మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామశాఖ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీటీపీఎస్ నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసిత రైతు కుటుంబాలకు ఉద్యోగాలు ఇప్పించిన చరిత్ర పార్టీదేనన్నారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, పట్టణ కార్యదర్శి సుధాకర్, జిల్లా సమితి సభ్యులు ఎస్‌కె.సర్వర్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, రమేష్, లక్ష్మయ్య, భీమరాజు కృష్ణ, రాజాబాబు, సతీష్, సీతారాములు, రాములు, లింగస్వామి ఉన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న నర్సింహారావు

చర్ల: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న హైదరాబాద్‌లో తెలంగాణా ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాకు రిటైర్డ్ ఉద్యోగులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని సంఘం భద్రాచలం డివిజన్ కమిటీ కార్యనిర్వాహక సభ్యులు పుష్పాల నర్సింహారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం చర్లలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్లందరికీ ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాగేశ్వరరావు, గంటె సత్యనారాయణ, మర్ల ప్రసాద్, అంకాల శ్రీనివాసరావు, విస్సా నాగభూషణం, ముత్తయ్య, శంకర్ పాల్గొన్నారు.

అవగాహన

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : మండలంలోని గుంపెన గ్రామంలో రాజీవ్ యువవికాస్ పథకం దరఖాస్తుదారులకు శుక్రవారం ఎంపీడీఓ మహాలక్ష్మి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అన్ని ధృవపత్రాలు జతచేశారా లేదా అనే విషయాలను దరఖాస్తుదారులను అడిగి తెలుసుకున్నారు.

పోషకాలను తునికి పుచ్చుకుని..

- అడవి తునికి పండ్లకు భలే గిరాకీ..
- మూడు వారాలు మాత్రమే దొరికే పండు


తునికికాయాలు అమ్ముతున్న మహిళలు

దుమ్ముగూడెం: అడవితల్లి అందించే పళ్లల్లో వరం ఆ పండు.. కేవలం వేసవిలో అదీ కేవలం మూడంటే మూడు వారాలు మాత్రమే దొరికే మహాప్రసాదంలాంటి పండు తునికి పండు. ప్రతీ రోజు మార్కెట్లో రసాయనాలతో పెంచిన పండ్లను తిన్నవారు ఖచ్చితంగా సహజ సిద్ధంగా పండిన పండ్లను ఇష్టపడుతుంటారు. మండలంలోని సరిహద్దు గ్రామాల్లోని అడవితో పాటు పక్కనే ఉన్న చత్తీస్‌ఘడ్ అటవీప్రాంతంలో దొరికే తునికి పండ్లను ఆదివాసీ గిరిజనులు, గొత్తికోయలు సేకరించి విక్రయిస్తున్నారు. తునికికాయల సీజన్‌లో నిత్యం ఉదయం పూటనే గిరిజన మహిళలు ఊరికి దగ్గరలో ఉన్న అడవిలోకి వెళ్లి తునికి పళ్లను సేకరించి అమ్ముతుండగా గిరాకీ బాగానే పెరిగింది. ఈ పండ్ల ధర కిలో రూ.100 పెట్టిన గిరాకీ తగ్గకపోవడం గమనార్హం.

పోషకాలు ఎక్కువ...

ప్రస్తుత పరిస్థితుల్లో ఏ ఆహారం తీసుకున్నా శరీరానికి అవసరమయ్యే పోషకాల కంటే రసాయనాలే ఎక్కువగా ఉంటున్నాయి. కానీ తునికి పండ్లు పోషకాలు పుష్కలంగా ఉండి ఆరోగ్య పరంగా మేలు చేస్తాయి. తీపి, వగరు రుచిలో ఉండే ఈ తునికి పండ్లలో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండి, ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. శరీరానికి కావాల్సిన ఖనిజ లవణాలు, వివిధ రకాల చక్కెరలు, పీచు పదార్థం కూడా ఇందులో లభిస్తుంది. కాలానుగుణంగా లభించే ఈ తునికి పండ్లను తీసుకుంటే శరీరానికి కావాల్సిన పోషకాలు లభిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచే పోషకాలు కూడా ఇందులో చాలానే ఉన్నాయి. ముఖ్యంగా ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి మనల్ని అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉంచుతాయి. విటమిన్లు ఏ, సీ, ఈ సమృద్ధిగా ఉంటాయి. ఈ పండ్లు తింటే కడుపులో పుండ్లు ఉంటే తగ్గుతాయి. రక్తం శుభ్రపడుతుంది.

సేకరణకు వేకువజామునే వెళ్తాం...



ప్రతీ సంవత్సరం తునికి కాయలు సేకరిస్తున్నా. ఈ సీజన్‌లో తునికి కాయలు కొనుగోలు చేసేందుకు చాలామంది ఎదురు చూస్తుంటారు. తునికి పండ్లు అంటే మాకు చాలా ఇష్టం. ఈ కాయలను సేకరించి వరిగడ్డిలో మాగబెట్టి పండిన వెంటనే తింటాం.

– శీలం లక్ష్మీబాయి, లచ్చిగూడెం

గిరాకీ బాగానే ఉంది..



అడవిలో కష్టపడి సేకరించిన తునికి పండ్లను విక్రయించడానికి గ్రామాల నుండి వస్తున్నాం. కాయలు తెచ్చిన రెండు, మూడు గంటల్లోనే అయిపోతున్నాయి. చేతిలో పైసలు కనపడుతున్నాయి తెచ్చిన కాయలు బట్టి డబ్బులు వస్తున్నాయి.

– పెనుబల్లి భద్రమ్మ, లచ్చిగూడెం